**కథ**

**జి.పద్మావతి**

# అనగనగా ఓ వీకెండ్

"అమ్మా! నేను వచ్చింది ఇవ్వాళే కదా... నాతో స్పెండ్ చేయవా? రెండు రోజుల్లో మళ్లీ హాస్టల్‌కెళ్లాలి. అంత ఇంపార్టెంట్ అయితే డాడీ వెళ్తారు. ప్లీజ్ అమ్మా! నువ్వు నాతో ఉండు. కొంచెం భయంగా కూడా ఉంది!" తల్లిని చుట్టేసి భుజం మీద తలపెట్టుకుని గారాలు పోతూ చెప్పింది హిమజ.

"డాడీ వేరే ఫంక్షన్‌కి అటెండ్ అవ్వాలి. ఎంత ఎవాయిడ్ చేద్దామన్నా కుదరట్లేదు. ఇద్దరం కలిసి ఒక్కదానికి వెళ్లాలి. వేరే వేరేగా ఇంకో ఫంక్షన్‌కి వెళ్లాలి. ఫోన్ చేస్తూ ఉండు. అన్నీ ఫ్రిజ్‌లో ఉన్నాయి.. పొద్దున్న సరోజ వచ్చి నీక్కావలసినవి వండి పెడ్తుంది. ఓ.కె!" మేకప్ మళ్లీ అద్దంలో చూసు కుంటూ అంది హిమజ తల్లి.

"అన్నయ్య ఎప్పుడు వస్తాడు... వీకెండ్‌కి ఇంటికి పంపిస్తారు కదా!" ఆశగా అడిగింది హిమజ.

"ఇవ్వాళ ఏవో క్లాసులు పెట్టారట. రేపు ఉదయం వస్తున్నాడు. మీరిద్దరూ వచ్చేసరికి ఇలా వెళ్లాల్సి వస్తోంది"

"పోనీ నేనూ వచ్చేయనా అమ్మా. అక్కడ పిల్లల్తో ఆడుకుంటాను. నీతో ఉన్నట్టు ఉంటుంది" హుషారుగా అంది.

"నువ్వేమన్నా చిన్నపిల్లవా హిమా.. టెంత్ క్లాస్‌కొచ్చావు. నిన్ను ఫంక్షన్‌లో చూసినవాళ్లు టెంత్ చదివే పిల్లని ఇలా తిప్పుతున్నావేమిటి మార్కులు తగ్గిపోవా? అనడిగితే నేనేం చెప్పను! అయినా ఆటలేంటి ఆటలు! అందుకే నిన్ను హాస్టల్‌లో పెట్టాను. పక్కన ఆంటీకి చెప్పాను. దేరింగ్‌గా ఉండాలి. ఆంటీ చూస్తానన్నారులే" అని చెప్తూ మేకప్ సామాను, బట్టలు, నగలు బ్రీఫ్ కేస్‌లో పెట్టుకుని కారు స్టార్టు చేసి మళ్లీ ఒకసారి కూతురికి ధైర్యం చెప్పింది. ఇల్లు లాక్ చేసుకుని లోపలే ఉండమంది.

"అన్నయ్య వచ్చేదాకా ఆంటీవాళ్ల ఇంటికెళ్లనా మమ్మీ" కారు దగ్గరగా వచ్చి అడిగింది హిమజ.

"సరే.. వెళ్లు కానీ పది గంటలయ్యాక ఇంటికి వచ్చి పడుకో. అక్కడ వద్దు. అన్నయ్య పొద్దున్నే వచ్చేస్తాడు..బై!" అంటూ స్పీడుగా వెళ్లిపోయింది హిమజ తల్లి.

'పెద్ద ఇల్లు, ఒంటరిగా అనిపిస్తుంది. హాస్టల్‌లో ఫ్రెండ్సున్నా ఉంటారు. అనవసరంగా వచ్చాను' అని మనసులో తిట్టుకుంటూ లోపలికెళ్లి ఫ్రెష్ అయ్యి మంచి డ్రెస్ వేసుకుని తాళం వేసి బంటీ వాళ్ల ఇంటికెళ్లింది హిమజ.

"రామ్మా హిమా.. మధ్యాహ్నం వచ్చావట కదా! స్టడీస్ ఎలా ఉన్నాయి టాప్ రాంక్ రావాలి నీకు. అవునూ మీ హాస్టల్‌లో ఎవరో టెంత్ క్లాస్ పిల్ల చనిపోయిందట. ఎలా? నువ్వు చూశావా? మీ స్కూల్‌లో ఏమని చెప్పుకుంటున్నారు!" పక్కన కూర్చుని ప్రశ్నల వర్షం కురిపించిందావిడ.

"ఏమిటా ప్రశ్నలు? నన్నడిగినట్లు అడుగుతున్నావు. అలా కంగారు పెట్టకు. భయపడి అక్కడకి వచ్చిందిట! నువ్వు కూర్చో హిమా... బంటీవాళ్లతో ఆడుకో...డాడీ వాళ్లు వెళ్లారా?" అని అడిగారు బంటీ వాళ్ల నాన్న ఆవిడని మధ్యలో ఆపేస్తూ.

"ఒక్క పావుగంట ముందే వెళ్లారంకుల్" అని చెప్పింది ఆయనకు.

"బాగా చదువుతున్నాను ఆంటీ... ఆ అమ్మాయి కేసు పోలీసులకు అప్పజెప్పారు, మేం భయపడ్డామని పొద్దున్న ఇంటికి పంపారు. అవునూ, మీరూ ఎక్కడికో వెళ్తున్నట్టున్నారు! బంటీ... బాబి ఎక్కడ?" అటూ ఇటూ వెతుకుతూ అడిగింది.

హిమజ మాటలు వినపడి ఇద్దరూ పరిగెత్తుకు వచ్చారు హాల్లోకి!

"మా ఇద్దరిపైనా అలిగాడమ్మా హిమా! ఏదో హాలీవుడ్ హర్రర్ పిక్చర్ వచ్చిందంట. అంకుల్ ఫ్రెండ్ కంపెనీ కోసం మాకూ టికెట్స్ బుక్ చేశాం రమ్మన్నారు. ఎటూ తొమ్మిది గంటలకల్లా వచ్చేస్తాం కదా. నీతో ఉండమంటే మా కూడా వస్తామని అల్లరి చేస్తున్నారు. పోనీ మానేద్దామంటే బావుండదు. టికెట్స్ వేస్ట్ అవుతాయి!" ఇంకా ఏవో కారణాలు చెప్తుంది బంటీ వాళ్లమ్మ. కాఫీ కలుపుకొచ్చి హిమజకందించి మళ్లీ చెప్తుంది.

"సెవెంత్ క్లాస్ చదువుతున్నాడు. ఇంకా భయమే! అయినా అలాంటి సినిమాలు చూడకూడదురా అంటే వినడు" బంటీ నీకు కొత్త వీడియో గేమ్ తీసుకొస్తాను, ఫైవ్‌స్టార్ తీసుకొస్తాను" అంటూ బ్రతిమలాడింది. "మళ్లీ వారం దాకా ఖాళీ ఉండదు" సణుక్కుంది.

"తమ్ముడు చూడు... చెప్పగానే ఒప్పుకున్నాడు. మా నాన్న ఈ వయసులో సినిమా పేరెత్తితే తన్నేవాడు." కొంచెం గట్టిగానే అన్నాడు బంటీవాళ్ల తండ్రి.

"సరే అక్కతో ఆడుకుంటాను!" బెరుకుగా అన్నాడు బంటీ.

"హమ్మయ్య!" తలమీంచి పెద్ద భారం దిగినట్లు మొహం పెట్టింది బంటీ వాళ్లమ్మ.

ఇల్లు తాళం వేసేసి బంటీని థర్డ్‌క్లాస్ చదువుతున్న వాడి తమ్ముడు బాబీని తీసుకొచ్చి హిమజా వాళ్లింట్లో ఉంచేసి గబాగబా వెళ్లిపోయారు.

* * *

సిటీకి కొంచెం దూరంగా ఇప్పుడిప్పుడే దెవలప్ అవుతున్న కాలనీ అది. బాగా కలిగిన వాళ్లు డూప్లెక్స్ ఇళ్లు. మధ్యతరగతి వారి దాబాలు... ఇంకొన్ని చిన్న చిన్న ఇళ్లు... పెద్దగా జనసంచారం ఉండదు. వచ్చే పోయే వాహనాలు, రెండు మూడు కార్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్లకి మెటీరియల్ తీసుకెళుతున్న లారీల చప్పుడు తప్ప ఆరు గంటలు దాటితే అంతా నిశ్శబ్దం. పెద్ద పెద్ద చెట్ల మీద పక్షుల అరుపులు... రాత్రి అయ్యేసరికి కీచు రాళ్ల రొద. అంత కాలనీకి ఒకే ఒక గార్డు. అందులో హిమజ, బంటీ వాళ్లవి, పెద్ద పెద్ద డూప్లెక్స్ ఇళ్లు. బాగా విశాలమైన స్థలం. ఫ్రెండ్స్ ఇద్దరూ దగ్గరుండి కట్టించుకున్నారు.

రెండిళ్ల మధ్య స్నేహానికి గుర్తుగా ఇంకా అడ్డుగోడ నిర్మించలేదు. చాలా గ్రౌండ్ ఉంది. కొంచెం చీకటిపడే వరకు కాలనీ పిల్లలతో ముగ్గురూ ఆటలాడేరు. చీకటి పడ్డాక వాళ్లిద్దరినీ తీసుకుని ఇంట్లోకెళ్లిపోయింది హిమజ. కేకు, స్నేక్సూ తిన్నారు.

"అక్కా... కేరమ్స్ ఆడదాం!" బంటీ అడిగాడు.

"వద్దు.. జెటిక్స్ చూద్దాం" చిన్నాడన్నాడు.

"అదెప్పుడూ వస్తుంది. అక్క ఉండదుగా!" బంటీకి ఆటల మీద ఉంది.

"టీవీ చూస్తూ కారమ్స్ ఆడదాం... ఓ.కె." అంటూ ఇద్దరికీ నచ్చజెప్పి కూర్చోబెట్టింది.

పైకి మాట్లాడుతోంది కానీ, గుండెలో దడగా ఉంది హిమజకి. నిశ్శబ్దంగా ఉంది. చెట్ల దగ్గర్నుండి వింత వింత అరుపులు... నిన్న హాస్టల్‌లో జరిగిన దృశ్యాలు... ఆ టీనేజ్ బుర్రలో రకరకాల ఆలోచనలు గుప్పిస్తున్నాయి. దానికి తోడు ఇద్దరు చిన్నపిల్లలు. తొమ్మిది దాటితే ఆంటీవాళ్లు వచ్చేస్తారులే... అని ధైర్యం చెప్పుకుంది.

"ఆ రెడ్ కాయిన్ నిన్ను తీయొద్దన్నానా!... దాన్ని నేను మాత్రమే కొట్టాలి! అంటూ రెండు కాయిన్స్ తీసి అన్నను కొట్టాడు బాబి. ఇద్దర్నీ ఊరడించి నచ్చజెప్పేసరికి ఫోన్ మోగింది. తల్లి చేసిందేమోనని పరుగెత్తుకొచ్చి ఫోన్ తీసింది హిమజ.

"హిమా నేనూ సత్యని... మన హాస్టల్‌లో జరిగిన ఇన్సిడెంట్ మీద మనం చెప్పిన అభిప్రాయాలు టీవీలో వస్తున్నాయి చూడు!" అని చెప్పి పెట్టేసింది.

సోఫాలో పిల్లలిద్దర్నీ పక్కన కూర్చోపెట్టుకుని ఛానల్ మార్చి చూసింది హిమజ. రక్తపుమడుగులో తమ కోస్టూడెంట్ కడుపులో దేవినట్లుగా ఉంది... భయం మళ్లీ తొంగి చూసింది...

"ఆంటీ వాళ్లేంటీ ఇంకా రాలేదు... సినిమాకేగా వెళ్లారు!" బంటీనడిగింది.

"హోటల్‌కెళ్లి ఉంటారు అక్కా.. మొన్న ఒకసారి సాటర్ డే మేఘనా రెస్టారెంట్‌లో డిన్నర్ చేసి వచ్చారు"

"మరి మీరు ఎక్కడ ఉన్నారు?"

"మీ మమ్మీ దగ్గరే ఉన్నాం. అయినా ఎక్కువ మీ అమ్మా వాళ్లే వెళుతుంటారట ఆ రోజు లక్కీగా ఉన్నారట... మా అమ్మ అంది!" టీవీ చాలా ఇంట్రెస్ట్‌గా చూస్తూ అన్నాడు బంటీ.

"మా అమ్మ చిన్నప్పుడు వదిలి వెళ్లలేదు... మీ మమ్మీనే ఇంత చిన్నపిల్లల్ని నాకే అప్పజెప్పేసింది!" కాస్త కోపంగా అంది. సరదాగా మొదలైన గొడవ కాస్తా పెద్దదైంది. ఒకరినొకరు తిట్టుకున్నారు. కారమ్స్ విసురుకున్నారు. బ్యాట్‌తో హిమజను కొట్టాడు బంటీ. అసలే ఆందోళనగా ఉన్న హిమ వంగదీసి వీపు మీద కొట్టింది. "నన్ను కొడతావా" అంటూ ఒకళ్లనొకళ్లు తోసుకున్నారు. ఈ తోపులాటలో బాబి హాల్‌లో ఉన్న మెట్ల మీద పడ్డాడు. తలకి బాగా దెబ్బ తగిలి రక్తం కారడంతో హిమ వణికిపోయింది. ఇది రెండో సారి...రక్తం... నెత్తురోడుతున్న బాబిని ఎత్తుకోడానికి దగ్గరికెళ్లింది.

"మా తమ్ముడిని చంపేశావు. నిన్నూ నేను కొట్టేస్తాను!" అంటూ బలంగా ఒక్క తోపు తోశాడు బంటీ హిమజని.

కిందపడి అక్కడే ఉన్న బ్యాట్ తీసి విసురుగా విసిరేసింది హిమజ, బంటీవేపు! తలకి తగిలి కిందపడ్డాడు బంటీ.

ఇల్లంతా నిశ్శబ్దం... మైండ్ బ్లాంక్ అయిపోయింది హిమజకి....టీవీ సౌండు కొద్దిగా వినపడేసరికి స్పృహలో కొచ్చింది. వీళ్లిద్దరినీ చంపేశానా? హత్యలు చేసేంత పైశాచికత్వం ఉందా నాలో? అనుకుంది. టీవీలో ఏదో గొడవ... అమ్మ కదూ! అయ్యో.... అమ్మ టీవీలో కెందుకొచ్చింది... పైశాచికంగా ఆడపిల్లల్ని పరాయి దేశాలకు అమ్మేస్తోందా! 'నో నిజం కాదు' గట్టిగా అరిచింది. క్లిప్పింగ్స్ చూపిస్తున్నారు. కింద స్క్రోలింగు వస్తుంది. అవును... అన్నయ్య రాలేదేమిటి. రోడ్ మీద ఏక్సిడెంట్ అయిందంట. రక్తపు మడుగులో కొట్టుకుంటున్నారు. ఇంజనీరింగ్ చదివే పిల్లలు ఉన్న కారేనట. అదిగో చెక్స్ షర్ట్...



అది అన్నయ్య... యస్... మరి నాకెవరూ లేరా, నన్ను పోలీసులు అరెస్టు చేస్తే, నాన్న ఎక్కడ... వద్దు నేనూ చచ్చిపోతాను. చిన్నారి పిల్లల్ని ఆంటీ నాకు అప్పజెప్పి వెళ్లింది... నేను రాక్షసిని... నాకెవరూ లేరు! దీనికిదే పరిష్కారం... యస్!' అనుకుంది హిమజ. గబగబా మెట్లెక్కి పైన టెర్రస్ మీంచి ఒక్కసారిగా దూకేద్దాం అనుకుంది. మెట్లు సగం ఎక్కేసరికి కాలింగ్ బెల్ మోగింది.

* * *

అది సిటీలో బాగా పేరున్న పెద్ద హాస్పిటల్. అక్కడ సెకండ్ ఫ్లోర్‌లో టెన్షన్‌గా తిరుగుతున్నారు హిమజ తండ్రీ, బంటీ వాళ్ల పేరెంట్స్. హిమ తల్లి మాత్రం వెక్కి వెక్కి ఏడుస్తుంది. కొంచెం దూరంగా చేతులు కట్టుకుని నించున్నాడు హిమా వాళ్లన్నయ్య.


"డాక్టరుగారు పిలుస్తున్నారు. లోపలికి వెళ్లండి" నర్స్ చెప్పగానే "ఎప్పుడు పిలుస్తారా?" అని చూస్తున్న నలుగురూ లోపలికెళ్లారు. ఆయన బాగా పేరున్న సైకియాట్రిస్ట్. పైగా హిమ తండ్రికి ఫ్రెండు.

"ఏమైంది... ఏమైనా చెప్తుందా, చాలా నెర్వస్‌గా ఉంది!" హిమజ తండ్రి అన్నాడు చెమట్లు కర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

"చెప్పండి ప్లీజ్, చిన్నపిల్ల బోలెడు భవిష్యత్తు

ఉంది!" తల్లి అంది.

"తను చిన్నపిల్లా?" కళ్లజోడు తీసి టేబిల్ మీద పెడ్తూ అన్నారు డాక్టరు. ఆయన ఏ రకంగా ఆ మాట అన్నారో అర్థం కాక తలెత్తి ఆయన వంకే చూస్తున్నారు నలుగురూనూ.




"తను చిన్నపిల్లే... టీనేజ్‌లోకి వెళ్లబోతున్న చిన్నారి. ఆ విషయం మీకు ఇప్పుడు అర్థం అయిందా? టీనేజ్‌లోకి అడుగు పెడుతున్న అమ్మాయి... పైగా హాస్టల్‌లో కోస్టూడెంట్ చనిపోవడం చూసి వచ్చినవాళ్లకి పేరెంట్స్ ఎంత గైడెన్స్ ఇవ్వాలి! నేను హత్య చేశాను... ముద్దులొలికే బంటీ, బాబీని చంపేశాను.. అమ్మ తప్పులు చేస్తుంది! నాన్న ఊరు వదిలి వెళ్లిపోయారు... ఇవే మాట్లాడుతుంది. షి ఈజ్ మెంటల్లీ డిస్టర్బ్‌డ్... నో హోప్!" మాటలాపి పేరెంట్స్ వంక చూశాడు.

"మీరే ఇలా అంటే ఎలా సార్" బంటీ వాళ్ల నాన్న అన్నాడు.

"అంతే మరి కన్నవాళ్లకే మీ పిల్లలు జాగ్రత్త అని చెప్పాల్సి వచ్చినందుకు సిగ్గుగా ఉంది!" నలుగుర్ని చూస్తూ అన్నారు డాక్టరు.

అసలేం జరిగింది సార్... మా పిల్లలు బాగానే ఉన్నారంటారు. తనేమో బాలేదంటారు. టెన్షన్ తట్టుకోలేకపోతున్నాను. చెప్పండి!" బంటీ వాళ్ల నాన్న అడిగాడు ఆతృతగా.

"హారర్ సినిమా పిల్లలు చూడకూడదని మీరు వదిలి వెళ్లారు. హాస్టల్లో అసలే భయపడి వచ్చిన అమ్మాయి కంటే మీటింగులూ, ఫంక్షన్‌లూ వీళ్లకి ముఖ్యమైపోయాయి. అసలే హిమ చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉంది. మీరు వెళ్లాక పిల్లలు ఆడుకున్నారు! లోపలికెళ్లాక చిన్న చిన్న విషయాలకు తగవులాడుకున్నారు. కొట్టుకున్నారు. ఇంతలో ఎవరో ఫోన్ చేసి 'హాస్టల్‌లో హత్యోదంతం' అని టీవీలో చూపిస్తున్నారని చెపితే న్యూస్ ఛానల్ మార్చిందట. జరిగిన క్లిప్పింగ్స్... ఆ తరువాత హత్యలు, అమానుషాలు... ఆ ఏడాది పొడుగునా జరిగిన అకృత్యాలు అవి చూసీ చూసీ నిద్రపోయింది. చిన్నపిల్లలు ఎక్కడ దెబ్బలాడుకున్నారో ఆ క్యారమ్ బోర్డ్ దగ్గరే నిద్రపోయారు. హారర్ సినిమా కంటే హారర్ షో ఇంట్లోనే చూశారు"

"అసలే డిస్టర్బ్‌డ్‌గా ఉన్న హిమజ టీవీలో చూసినవన్నీ తన ఇంట్లో వాళ్లకే జరిగినట్లు కలగని, పడుకునే ముందు కొట్లాటలో బంటీని, బాబీని చంపేసినట్లు ఊహించుకుని అదే వాస్తవమనుకుంటోంది"

"ఇదంతా మీకెలా తెలుసు?" హిమ తండ్రి లేచి నించున్నాడు.

"ఆ టైమ్‌కే మీ అబ్బాయి డోర్ బెల్ కొట్టాడట, తలుపు తీసింది హిమే కానీ, అన్నయ్యతో ఏవేవో మాట్లాడుతుంటే, పరిస్థితి అర్థం అయిన అతను వెంటనే నాకు ఫోన్ చేశాడు. రాత్రి నేను వెళ్లి పిల్లల్ని ఇంటికి తీసుకు వెళ్లి మీకు మాత్రం... పిల్లలకి బాలేదని ఫోన్ చేయించాను. హాస్పిటల్‌కి రమ్మని, కావాలనే మిమ్మల్ని టెన్షన్ పెట్టాను. ఇలాంటి తప్పులు మళ్లీ జరగకూడదని!" హిమా పిల్లలు క్షేమంగా ఉన్నారు కదా "థేంక్ గాడ్" అన్నారు, బంటీ వాళ్ల పేరెంట్స్.

"మరిప్పుడు హిమ పరిస్థితి ఏమిటి!" భయపడుతూ అడిగింది తల్లి.

"ప్రొద్దున్న ఇంట్లోనే కౌన్సిలింగ్ ఇచ్చాను. బంటీ, బాబీతో ఆడుతూ రియలైజ్ అయింది. ఏది ఎలా ఉన్నా మీ కేర్ చాలా ముఖ్యం. టైంకి వాళ్లన్నయ్య రాకపోయుంటే ఏం జరిగేదో..." అర్థోక్తిగా ఆపేశారు. డాక్టరు.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు అందరూ. "థాంక్యూ మై ఫ్రెండ్!" అన్నాడు హిమ తండ్రి డాక్టరు గారి చేతులు పట్టుకుని.

"పిల్లలు ఇంట్లోనే ఉన్నారు, రండి వెళదాం ఈ సండే మా ఇంట్లో సెలబ్రేట్ చేసుకుందాం" డాక్టరన్నారు.

"ఇంకెప్పుడూ పిల్లల్ని వదలకూడదు. హాస్టల్‌కి పంపను హిమని, ఇంటి నుండే పంపిస్తాను కొంచెం తేరుకునే వరకు" తల్లి అంది.

"అవును... పెద్దవాళ్లు లేకుండా పిల్లలేం చేస్తున్నారో. ఏ చూస్తున్నారో... ఎలా రియాక్టవుతున్నారో గమనించుకోవాలి!" బంటీ వాళ్లమ్మ అంది.

"అవునూ! నాకు తెలియక అడుగుతాను! పిల్లలకి వంట్లో బాగాలేదనో, పరీక్షలనో ఫంక్షన్స్‌కి హాజరుకాకపోతే కొత్తగా క్రిమినల్ కేసేమన్నా పెడుతున్నారా?" డాక్టరుగారన్న జోక్ అర్థం అయిన ఇద్దరూ సిగ్గుగా నవ్వేశారు.

ఎవరి కారులో వాళ్లు డాక్టరు గారింటికి బయలుదేరారు తేలికైన మనసులతో.



## డేరింగ్ షెర్లిన్

తెలుగులో 'ఏ ఫిలిం బై అరవింద్'లో నటించిన మోనాచోప్రా తన పేరుని షెర్లిన్ చోప్రాగా మార్చుకున్నాక వార్తల్లోకి వస్తూనే వుంది. బాలీవుడ్‌లో నిత్యం ఏదో ఓ రకంగా ఆమె పేరు వినిపిస్తూనే వుంటుంది. తాజాగా షెర్లిన్ న్యూడ్‌గా ఓ సినిమాలో నటించడానికి రెడీ అనడంతో అంతా విస్తుబోతున్నారు. పెద్ద పెద్ద హీరోయిన్లు టూపీస్ బికినీల్లో నటించడానికి సిద్ధమవుతున్నప్పుడు నేనిలా నటిస్తే తప్పేంటి? అనేది షెర్లిన్ వాదన అట. ఇంతకీ సెన్సారు వారి కత్తెర నుంచి ఆ న్యూడ్ సీన్లు తప్పించుకుని ప్రేక్షకుల ముందుకు ఎలా వస్తాయో?